# కాంతయ్య ★

రచన : కొడిమెల శైలజ

కాంతయ్య ఆరుబైట కుక్కి మంచంమీద మేనువాల్చి అర్థరహితమైన దృష్టి సారిస్తున్నాడు ఆకాశంలోకి. అప్రయత్నంగానిట్టూర్చాడు. అతడి దృష్టిఅంతా చంద్రుని మీదే వుంది. పెద్దగా ఆవులించాడు. తలుపు తీసికొని కాంతయ్య భార్య గౌరి వచ్చింది బైటకు. ఆమెను చూసి కళ్ళు మూసుకొని నిద్ర నటించాడు కాంతయ్య. "ఇప్పుడే కదండీ ఆవులించారు. మళ్ళీ ఇంతలోనే నిద్రపోతున్నట్లు నటిస్తున్నారా ?" అంది అతని మంచం దగ్గరగావచ్చి. "అబ్బే ! నిద్రపోవటం లేదు. వూరికే కళ్ళు మూసుకు న్నాను." "మీకేం. నిశ్చింతగా నిద్రపోయినానిద్రపోతారు. తెల్లవారితే యిల్లు గలాయనకు అద్దెక్కణ్ణుంచి తెచ్చి ఇవ్వాలీ అనే దిగులు నాకుంటుందిగానీ- మీకెందుకుం టుందిలెండి ! రేప్రొద్దుటే వచ్చి ఎన్ని తిట్లు ఎన్ని శాప నార్థాలు పెడతాడో ఏమిటో? తలచుకుంటే నాకు చాలి భయమేస్తోంది." "గౌరీ నేను నిశ్చింతగాఉన్నానని నీవెలా అనుకుంటున్నావ్. నాకూ నీలాగే ఆత్మాభిమానముంది. నలుగుర్లో తలవంచడానికి నీలాగా నాకూ ఇష్టంలేదు. పరిస్థితుల ప్రాబల్యమలావుంది. పరిస్థితులకు బానిసలం కాకతప్పదు గౌరీ!" అన్నాడు గంభీరవదనంతో నిదా నంగా. "అంటే— రేపు ఇల్లుగలాయన అనే అడ్డమైన మాటలూ భరించక వేరే మార్గం లేదన్నమాట?" అంది ఆవేశంతో. "వేరేమార్గం? ఉహూఁ" అన్నాడు కాంతయ్య.

"ఆలోచిస్తే ఎన్నయినా మార్గాలున్నాయి" అన్నది గౌరి. "ఎన్నో మార్గాలున్నాయా ?" అంటూ గౌరి కంఠాన్ని చూశాడు. వెంటనే అతనికళ్ళు వెలుగును నింపుకొని విచిత్రంగా మెరిశాయి.

"సీమెళ్ళో గొలుసు అమ్మేద్దాం. ఇల్లుగలాయనకు మనమివ్వాల్సిన బాకీ కొంతన్నా తీరుతుంది." అన్నాడు గౌరి మెడలో వున్న వంటిపేట గొలుసువంక చూస్తూ.

గౌరి మనస్సు చివుక్కుమంది. "మీకళ్ళకి- చివరకు మిగిలిన ఈ గొలుసు ఒక్కటీ కనిపిస్తోందన్నమాట. ఊఁ. దీన్నికూడా తీసుకువెళ్ళండి. అన్ని వస్తువులు అమ్మగాలేంది ఇదొక్కటి అమ్మితే మాత్రమేం ?"అంది బొట బొట కన్నీరు కారుస్తూ.

వ్యధితకంఠంతో "ఇంతకు మించి వేరే గత్యంతరం ఏదీలేక అలా అన్నాను గౌరీ. ఆ గొలుసు నీవద్దే ఉండ నియ్యి. రేపటికేదో ఒక మార్గం ఆలోచిద్దాం"

"మీరు పట్టిన కుందేటికి మూడే కాళ్ళంటారయ్యే ! అందరూ మనలాగే నరకం అనుభవిస్తున్నారా ! పక్కింటి తాశిల్దారుగారి భార్య చూడండి. పూటకు మూడు కోకలు కడుతుంది. నెలకు పాతికసార్లు సినిమాకెడుతుంది. ఇక వాళ్ళింట్లో వున్న విలువైన వస్తువుల విషయం చెప్పనే అక్కర్లేదు. ఇవన్నీ తాశిల్దారుగారి కొచ్చే జీతం రాళ్ళ తోనే వస్తున్నాయంటారా ? ఆయన చెయిజాపుతున్నా డేమో సుఖపడుతున్నాడేమో ! మనమూ ఉన్నాం, నామాల కాకిలా! హెడ్‌క్లర్కు ఉద్యోగం చేస్తూ. జీతాన్ని మించి ఒక్క కానీ కూడా సంపాదించడం లేదంటే ఎవరైనా నవ్వుతారు. ఐదుగురు పిల్లల తండ్రి అయినా మీ కొకళ్ళు చెప్పాలా ? మన సంసారాన్ని, మన పిల్లల దుస్థితిని చూసైనా మీ పట్టు విడవరు. ఇదేం ప్రారబ్ధ కర్మమండీ ?"

మౌనంగా నిట్టూర్చాడు కాంతయ్య.

"బెల్లం కొట్టిన రాయిలా ఏం మాట్లాడరేమండీ ?" ఆమె సహనాన్ని కోల్పోయింది.

"నీవు నా పరిస్థితిని అర్థం చేసుకోలేనప్పుడు, ఏం మాట్లాడి ఏం లాభం గౌరీ? నా ఆశయాలు, ఆదర్శాలు- ఇన్నేళ్ళ మన దాంపత్య జీవితంలో నీ వెరగనివికావు. నేను వాటికి భిన్నంగా ఏ నీచమైన పనీ చెయ్యను."

కోపంగా "అది నీచమైన పని ఎందుకవుతుందండీ ? సంసారాన్ని నిలబెట్టు కోవడం కోసం చేసిన పని, నీచ మైనదవుతుందా ?"

కాంతయ్య చిన్నగ నవ్వి "కడుపు కక్కూర్తి కోసం లంచాలు తీసుకుంటామా ? అది నీచమైన పనని నీకు తెలిసి కూడా నిన్ను నీవు సమర్థించుకోటానికి అలా అంటున్నావ్" అన్నాడు.

"మీ కన్నీ నీచపుపనులే ! ఏఉద్యోగస్థుడండీ లంచాలు

తీసుకోంది ? మీ రొక్కరూ యిక్కడ మడి కట్టుకొని కూర్చుంటేసరా? అందరూ నడుస్తున్న త్రాటిమీదనడవక"

బాధగా "అబ్బ ! నన్ను వేధించకు గౌరీ !" అన్నాడు.

ఈసడింపుగా, "అవును. నేననే ప్రతీమాటా మీకు బాధగానే ఉంటుంది. ఎంతసేపూ నేనే మిమ్మల్ని బాధ పెడుతున్నానను కుంటారుగానీ, మీరు నన్ను బాధపెడు తున్నాననుకోరే ? రొమ్ముమీద కుంపటిలా వున్న పెద్ద మ్మాయి విజయని చూసి, నేనెంతగా తల్లడిల్లి పోతు న్నానో మీకెలా అర్థమవుతుంది ? ఒకవైపునుంచి అమ్మాయి పెళ్ళీడు దాటిపోతోంది. మరోవైపునుంచి మీరు రిటైర్ అవ్వాల్సిన కాలం దగ్గరకొస్తోంది. ఏదో ఒక విధంగా నాలుగు రాళ్ళు వెనకేసుకోపోతే– అమ్మా యికి మూడు ముళ్ళూ పడేదెలాగ చెప్పండి ?"

తన దృఢ నిశ్చయాన్ని సడలనివ్వ కూడదను కొన్నాడు కాంతయ్య.

"ఏవో ఆదర్శాలు, ఆశయాలూ అంటూ వాటిని పట్టుకొని వ్రేలాడితే ఎలా చెప్పండి ? ముందు బ్రతుకు సాగే మార్గం చూడాలిగాని. ఎవరో పెట్టిపుట్టిన మహాను భావులు, ధనవంతులు, ఆదర్శాలు, ఆశయాలు అంటే అర్థముందిగాని మనబోటివాళ్ళకు అవెందుకూ పనికిరావు"

కాంతయ్య వేదనా పూరిత స్వరంతో "గౌరీ ! ఇన్నేళ్ళ మన సంసార జీవితంలో నీవు కష్టాలేగాని, సుఖాలు చవిచూచి ఎరుగవు. నీ జీవితంలో అమృతానికి బదులు హాలాహలం నింపానుకదూ ?" అంతవరకూ వున్న అతని లోని ధైర్యం సడలిపోయింది. కళ్ళనుంచి కన్నీరు స్రవించింది. భర్త కన్నీటిని చూసి గౌరి హృదయం నీరైపోయింది. "అదేవిటండీ చిన్న పిల్లల్లా కన్నీరు విడుస్తున్నారు ?" ఆమె రుద్ధకంఠంతో అతనిని ఓదార్చ బోయింది. "గౌరీ !............" అన్నాడు దుఃఖాన్ని దిగమ్రింగుతూ. "అబ్బే ! తుడుచుకోండి" ఎంతో ఆప్యా యంతో అని, మెళ్ళోంచి గొలుసు తీసి అతని చేతులో పెట్టింది "ఈ చివరి నగను కూడా అమ్మేస్తున్నామా గౌరి ?" అన్నాడు బాధగా. "ఇల్లుగలాయన అనే మాటలవల్ల పడే బాధముందు ఇదెంత ? దీంతో సుమారు నాలుగు నెలల బాకీ అన్నా తీరకపోతుందంటారా ?" "తీరుతుంది" అన్నాడు పరాగ్గా.

గౌరి ఆవులించి "బాగా ప్రొద్దుపోయింది. నాకు నిద్ర వస్తోందండీ, పోయి పడుకుంటాను. మీరు కూడా పడు కోండి" అని భర్తకు చెంబుతో మంచినీళ్ళు మంచం వద్ద పెట్టి లోనికి వెళ్ళి తలుపేసుకొంది గౌరి.

కాంతయ్య ఒక ఆఫీసులో గుమాస్తాగా ప్రవేశించి తన స్వయంకృషి వల్లనే హెడ్‌క్లర్క్ అవగలిగాడు. మొదట్నుంచి పాపభీతి, దైవభక్తి అతనిలో మూర్తీభ వించాయి.

అతని అయిదుగురు పిల్లల్లో ఇద్దరు ఆడపిల్లలు, ముగ్గురు మొగ పిల్లలూ. పెద్ద పిల్లకు పెళ్ళీడు దాటి పోతోందప్పుడే. రెండవ పిల్ల మరో నాలుగు సంవత్స రాలకు పెళ్ళీడు కొస్తుంది. తతిమ్మా ముగ్గురు మొగ పిల్లలూ ఇంకా చిన్న వాళ్ళు. ఒకడు ఎలిమెంటరీస్కూల్లో ఇద్దరు హైస్కూల్లో చదువుకొంటున్నారు. కాంతయ్య చెయిజాపితే బోలెడంత డబ్బు దొరుకుతుంది. అయినా కాంతయ్య ఇంతవరకెన్నడూ చెయి జాపి ఎరుగడు. కనుకనే హెడ్‌క్లర్క్ అవగలిగాడు. అతడు డబ్బు సంపాదించడానికి అవకాశముండికూడా– ఆ అవకాశాన్ని వినియోగించడంలేదే అని గౌరీ, ఆమె తమ్ముడూ వాపోతూ ఉంటారు. ఇంట్లోవున్న కొద్దిపాటి బంగారు నగలు, వెండి సామాన్లు ఏనాడో షరాబు కొట్టును ఆశ్రయించుకున్నాయ్. చివరకు మిగిలింది ఒక్కగొలుసు. దానికీ రెక్కలొచ్చాయ్.

ఇలా రోజులు గడుస్తూ ఉండగానే– మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లు, కాంతయ్య ఆఖరి కొడుక్కి పెద్దగా జ్వరం ముంచుకొచ్చింది. అక్కడే ఎరుగున్న ఒక హోమియోపతి డాక్టర్ని పట్టుకొని కొడుక్కి వైద్యం చేయించాడు. జీతంలో మిగిలినపాతిక ముప్ఫయి రూపాయలూ ఖర్చు పెట్టాడు మందులకోసం, డాక్టరు కోసం. కాని ఫలితం దక్కలేదు. గౌరీ కాంతయ్యల దుఃఖానికి, పిల్లల పెడబొబ్బలకి అంతులేదు.

పెద్ద డాక్టర్ని తీసుకొచ్చి కొడుక్కు మంచి మందులు ఇప్పించి, సరైన ట్రీటుమెంట్ చేయించలేకపోయానే అని కాంతయ్య తనలో తానే కుమిలిపోయాడు. తన కొడుకు చావుకు కారణం మంచి మందులు వాడకపోవ డమే. తన కొడుకును తనే కడుపున పెట్టుకున్నాడన్న

మాట. కుమారుని జబ్బునుంచి కాపాడుకోలేనివాడు కూడా ఒక తండ్రేనా? అనిపించిం దతనికి. దీనికంతకూ కారణం డబ్బు! డబ్బు సాధించలేనిదేదీ ఉండదనిపించిందతనికి. ఈవిధంగా తనలో తాను తలపోస్తున్న కాంతయ్యకు ఒక రోజున కలలో కొడుకు కనిపించి ఏడుస్తూ "నాన్నా! నాన్నా! నన్ను చంపేశావా? నేను చనిపోతూంటే చూస్తూ పూరుకున్నావా నాన్నా? నాకింకా బ్రతకాలని ఉంది నాన్నా! మంచి సూటూ,బూటూ వేసుకొని దొరలాగ తిరగాలనుంది నాన్నా!" అని అన్నట్లు అనిపించింది. అనిపించడమేకాదు- కలలో కళ్ళకు కట్టినట్లు కనుపించింది. త్రుళ్ళిపడి నిద్రనుంచి లేచిపోయాడు కాంతయ్య. అతని ఆశయాలు, ఆదర్శాలు తలక్రిందులయ్యాయి. తనతో పనివుండి వచ్చే ప్రతివ్యక్తి దగ్గరా విపరీతంగా లంచాలు తీసుకొంటున్నాడు కాంతయ్య. ఎవరినోటవిన్నా 'కాంతయ్య మారిపోయాడు, కాంతయ్య మారిపోయాడు' అనే మాటే. కష్టాలన్నీ మంచు విడిపోయినట్లు విడిపోయాయి. కాంతయ్య తృప్తితో నిట్టూర్చగలిగాడు.

ఒక రోజున హెడ్‌క్లర్కు కాంతయ్య నడిబజార్లోంచి పోలీసుల మధ్య చేతులకు బేడీలతో పోలీసు స్టేషనుకు ప్రయాణమై వెళ్ళాడు. అతడి శిరస్సు అవమానభారంతో వొంగిపోయింది. బజారులో తలా ఒకరు తలొక విధంగా అనుకొంటున్నారు అతన్ని చూసి. "నేనేనాడో అనుకొన్నాను, వీడికి పోయేకాలం దాపురించిందని. 'వినాశకాలే విపరీత బుద్ధి' అని వీడికి ఉద్యోగం ఊడి ఖైదు ప్రాప్తించాల్సిన కాలం రాబట్టే లంచాలు తీసుకోవడం మరిగాడు" అని తన ప్రక్కనున్న వ్యక్తితో మరో వ్యక్తి అంటున్నాడు.

---


బిడ్డల లివరు అండు స్ప్లీను వ్యాధులకు

పాత్రుడుగారి బాలసంజీవిని

డాక్టరు పిల్లా పాపయ్యపాత్రుడుగారి "బాలసంజీవిని" నిజముగ అమోఘమైనది. పిల్లలకు సంభవించు లివరు అండు స్ప్లీను వ్యాధులలో ప్రథమ దశయందుగాని, కాంప్లికేటెడ్ స్థితియందుగాని తప్పకుండ గుణమిచ్చును. వైద్యవృత్తియందును నా స్నేహితులలోను బంధుకోటిలోను అనేకులు ఉపయోగించుటవల్లను "బాలసంజీవిని" యొక్క గుణాతిశయములు పరీక్షించుటకు అవకాశమేర్పడినది. బజారులోగల యితర లివరు ఔషధములుగూడ యిదివరలో వాడి చూచితినిగాని "బాలసంజీవిని" వాడిన పిమ్మట పైవాటినెల్ల విసర్జించి దీనినే హెచ్చుగ వాడుచున్నాను. అమోఘముగ నిట్టి మహాదౌషధమును ప్రజోపయోగమునకు వినియోగించుచున్నందుకు పిల్లావారి వంశము స్తుతిపాత్రమైనది.

డాక్టరు: ..........................

వివరములకు:

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదర్స్,

నెం. 19, దక్షిణమాడా వీధి, మైలాపూరు, మద్రాసు 4.

ఫోను: 71354

కుంభకోణం బ్రాంచి:

నెం. 7 సారంగపాణి కోవిల్

తూర్పు వీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.